
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




ఈ విగ్రహావిష్కరణకే.. ఏర్పాటు


ప్రమాదానికి కారణమైన ఫ్లెక్సీ ఇదే..


మృతుల కుటుంబీకుల రోదన

ఆవిరైన.. ఆనందం

ఫ్లెక్సీ పెడుతుండగా విద్యుదాఘాతం.. నలుగురి మృతి


సంఘటన జరిగిన తాడిపర్రు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం..సముదాయిస్తున్న పోలీసులు

సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం.. రెండు సామాజిక వర్గాల మధ్య పోరాటం.. ఒకరు విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే.. మరొకరు విగ్రహం ఎలాగైనా ఏర్పాటు చేయాలని తలంచారు.. గత 18 నెలలుగా ఎదురుచూపులు.. విగ్రహావిష్కరణ రోజు రానే వచ్చింది.. పట్టలేనంత ఆనందం.. ఆ వేడుక ఎంతో ఘనంగా నిర్వహించాలని తలంచారు.. ఆ ఆనందం వెంటే విషాదం ఉందని ఊహించలేదు.. ఆదివారం ఉదయం అంతా విగ్రహావిష్కరణ కార్యక్రమాల్లోనే కలియతిరిగారు.. తెల్లవారితే విగ్రహావిష్కరణ.. ఒక పక్క భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.. మరో పక్క టెంట్‌లు.. కుర్చీల ఏర్పాట్లలో మరికొందరు ఉన్నారు.. ఎవరి ఏర్పాట్లలో వారుండగానే ఏడుగురు యువకులు 20 అడుగుల భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు.. సోమవారం తెల్లవారుజాము కావడంతో పైన ఏమి ఉందో కనిపించలేదు.. అంతే ఒక్కసారిగా ఫ్లెక్సీని పైకెత్తారు.. అంతే ఆ ఫ్లెక్సీ విద్యుత్ వైర్లకు తగలడంలో ఫ్లెక్సీకి ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేమ్‌కు విద్యుత్ పాస్ అయ్యింది.. నలుగురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు.. మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు.. మరో ఇద్దరు స్వల్పగాయాలపాలయ్యారు. అంతే అప్పటి వరకూ ఎంతో సందడిగా ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా మూగబోయింది.. గ్రామస్తులు విగజీవులుగా పడి ఉన్న నలుగురిని పట్టుకుని సపర్యలు చేస్తూనే ఉన్నారు..ఒరేయ్ లేవండిరా..లేవండిరా అంటూ అంతా చుట్టూచేరి పిలుస్తూనే ఉన్నారు.. అయినా చలనం లేదు.. నలుగురు యువకుల్లో ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి.. పిల్లలు ఉన్నారు.. ఒకరికి మాత్రమే పెళ్లికాలేదు.. కుటుంబీకులు అంతా చేరి మృతదేహాలను పట్టుకుని బోరుమన్నారు.. ఇక మాకు దిక్కెవరంటూ కన్నీటి పర్యంతమయ్యారు.. అప్పటి వరకూ ఎంతో సందడిగా అరుపులు.. కేకలతో ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా రోధనలతో మిన్నంటింది.. ఆనందం కాస్తా ఆవిరైంది..


-7లో

జీజీహెచ్ మేనేజర్‌పై విచారణ

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుపై విచారణ ప్రారంభమైన ట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పక్కా ఆధారాలతో కలెక్టర్‌కు, జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదులు అందడంతో అందులో జత చేసిన ఆధారాలతో తక్షణ విచారణకోసం కలెక్టర్ ఆదేశాలతో కమిటీని నియమించారు. కమిటీ ఛైర్మన్‌గా డిప్యూటీ కలెక్టర్, హాస్పటల్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.శ్రీధర్, కమిటీ సభ్యులుగా ఆర్ఎంసీ ఏడీ శ్రీనివాస్, జీజీహెచ్ ఏవో శేషేంద్రశర్మ వ్యవహరిస్తున్నారు. విచారణలో భాగంగా గతనెల 24న నరసింగరావుకు నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న నరసింగరావు అదేరోజున విచారణకు హాజరుకాగా 278 నర్సింగ్ పోస్టుల్లో 28మంది శాతం అనగా 56పోస్టులు ఓపెన్ క్యాటగిరిలో కేటాయించాల్సి ఉండగా ఆ సంఖ్య దాటి మరో ఏడు పోస్టులు లంచం తీసుకుని అక్రమంగా అనర్హులకు కట్టబెట్టాడన్న ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మరింత లోతైన విచారణను చేపట్టి నిజాలను నిగ్గుతేల్చేందుకు రంగంలోకి దిగిన విచారణ బృందం 20 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని నరసింగరావుకు అందించింది. దీనిఆధారంగా 24 గంటల్లో సమాధానం ఇవ్వాల్సి ఉన్నా నేటికి రెండు వారాలు గడిచినా ఆయన నుంచి సమాధానం లేదు. పైగా విచారణ నిలుపుదల చేయాలంటూ ఉద్యోగ సంఘ నేతలను ఆశ్రయించి వారి ద్వారా విచారణ కమిటీపై ఒత్తిడి తెచ్చేలా ప్రయత్నించడం కలెక్టర్ వరకు వెళ్లింది. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ రాజీపడొద్దని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నరసింగరావుకు అందుకున్న ప్రశ్నావళికి సమాధానం ఎందుకు ఇవ్వలేదని మెమో జారీ చేయాలని కమిటీ నిర్ణయించింది.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి: డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం కలెక్టరేట్ వివేకానంద హాలులో సోమవారం జరిగింది. డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. మొత్తం 290 అర్జీలు అందాయన్నారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి లల్లి పాల్గొన్నారు.



ఓటేద్దాం! మాస్టారు!


టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- ఈ నెల 11న నోటిఫికేషన్
- వచ్చే నెల 5న పోలింగ్
- 9న ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు

(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది డిసెంబర్ 15న రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గంనుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆయన పదవీ కాలం 2027, మార్చి 29వ తేదీ వరకూ ఉంది. కానీ ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఎన్నిక జరగనుంది. ఈ ఉప ఎన్నికకు ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుంది. 18 వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 19న నామినేషన్ల స్క్రూట్నీ చేస్తారు. 21న అభ్యర్థుల విత్‌డ్రాకు చివరితేదీ. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుంది. 9న ఓట్లను లెక్కిస్తారు. 12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక అంటే చాలా ప్రతిష్ఠాత్మకంగా జరుగుతోంది. ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయవర్గాలకు ఓటుహక్కు ఉంటుంది. ఉపాధ్యాయ వర్గాలనుంచే పోటీ చేయాల్సి ఉంది. ఎలిమెంటరీ, యూపీ స్కూళ్ల టీచర్లకు ఓటుహక్కు లేదు.ప్రభుత్వ ప్రైవేట్ హైస్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలు,ఇంజనీరింగ్ కళాశాలలో పని చేసే అధ్యాపకులందరికీ ఓటుహక్కు ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల ఓటుహక్కుకు అర్హతను హెచ్ఎం, కళాశాలలో ప్రిన్సిపాల్స్ సిఫారసు చేస్తారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో టీచర్ల అర్హతను డీఈవో సిఫారసు చేస్తారు. ఇంజనీరింగ్ కళాశాలలోని టీచర్లకు జేఎస్‌టీయూ సిఫారసు చేస్తుంది. ఈనెల 6న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. 2021 ఎన్నికలలో 17వేలమంది ఓటర్లు ఉన్నారు. గత నెల 24న ప్రకటించిన ముసాయిదా జాబితాలో కొత్తగా 13,677మందికి ఓటు లభించింది. మొత్తం 30వేలమంది ఓటర్లుండొచ్చు. ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదలైంది.

అభ్యర్థులు వీరే..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు అంటే తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి, ఏలూరు,అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ జిల్లాల పరిధిలోని రంపచోడవరం, చింతూరు (ఎటపాక) డివిజన్ల పరిధిలోని టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఇప్పటి వరకూ పీడీఎఫ్ ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థిగా పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మం డలం నారినమెరక పంచాయతీలోని గమళ్లపేటకు చెందిన బొర్రా గోపిమూర్తి పేరు ఖరారైంది. ఎస్‌టీయూ నుంచి లంకలపల్లి శ్రీనివాసరావు పేరు మొదట్లో వినిపించింది.కానీ ప్రస్తుతం మౌనంగా ఉండడం గమనార్హం. గత ఎన్నికల్లో ఎస్‌టీయూ తరఫున పోటీచేసి ఓటమిపాలైన గంధం నారాయణరావు కూడా పోటీకి వస్తారనే ప్రచారం ఉంది. ప్రస్తుతానికి ప్రచారంలో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ముందున్నారు.



మాటల్లేవ్.. చేతలే!

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా..

- పిఠాపురం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- మోడల్ నియోజకవర్గంగా చేస్తా
- సమస్యలు నా దృష్టికి తీసుకురండి
- గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్
- పిఠాపురంలో సుడిగాలి పర్యటన

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'అన్నిరంగాల్లో పిఠాపురాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నాం. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మాటలు కాదు.. చేతల్లో చేసి చూపిస్తున్నా.. ఎన్నికల ముందు మీకు ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలను మిగిలిన నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు చూసి ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తా..' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రకటించారు.




ఇంత దారుణమా..
గ్రామీణ నీటిపారుదల శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం తన పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తుండగా ఒక కుళాయి నుంచి నీరు మెల్లగా రావడం చూసి నిర్ఘాంత పోయారు.. కాసేపు అలా దీర్ఘంగా చూస్తుండిపోయారిలా..

మధ్యాహ్నం వచ్చారు.. సాయంత్రం వెళ్లారు!

పిఠాపురం శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తొలిసారి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనల్లో పాల్గొన్నారు. మండల కేంద్రాలైన గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లిల్లో సుడిగాలి పర్యటన జరిపారు. దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వివిధ వర్గాల ప్రజల నుంచి విన తులు స్వీకరించారు. వారి సమస్యలపై స్పందించారు. పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మిగిలిన వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మధ్యాహ్నం 12.36 గంటలకు చేరుకున్నారు. అక్కడ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని పిఠాపురం టీటీడీ కల్యాణమండంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు.అక్కడి నుంచి కొత్తపల్లి చేరుకుని పీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని చేబ్రోలు నివాసానికి చేరుకున్నారు. కారు నుంచే వినతిపత్రాలు స్వీకరించి సాయంత్రం 5.18 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


సామర్లకోట భీమేశ్వరాలయంలో దీపాలు వదులుతున్న మహిళలు


అన్నవరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- కార్తీకమాసం తొలి సోమవారం శైవక్షేత్రాల కిటకిట
- పాదగయ, సామర్లకోట, అన్నవరం ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాలకు జలాభిషేకంచేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని పాద గయ క్షేత్రం మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వాహనాలను కోలంక రోడ్డు మీదుగా మళ్లించారు. డిప్యూటీ సీఎం పవన్ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ అంక్షలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భక్తులతో కిక్కిరిసిన భీమేశ్వరాలయం

సామర్లకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలిసోమవారం మహాపర్వదినం సందర్భంగా పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో తెల్లవారుజామున 4గంటలకు ముందుగా గోపూజలను చేసి తొలి అభిషేకపూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు చేరుకోవడంతో క్యూలైన్లు ఆలయం బయట ప్రాకారం వరకూ చేరుకున్నాయి. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో అభిషేక పూజలను ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి పండితులు చెరుకూరి రాంబాబు విశేష పూజలు నిర్వహించారు.

రత్నగిరిపై రద్దీ

అన్నవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పురస్కరించుకుని సత్యదేవుడి ఆలయం భక్తులతో రద్దీ నెలకొంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఒంటిగంటనుంచి వ్రతాలు, 2గంటలనుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు వేచియుండాల్సి వచ్చింది. సోమవారం ఒక్కరోజు 50 వేలమంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 4196 వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా రూ.50లక్షల ఆదాయం లభించింది. ఈవో రామచంద్రమోహన్ క్షేత్రస్థాయికి వెళ్లి సూచనలు చేశారు.

ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన


గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థితో పవన్ కరచాలనం


కాకినాడ రూరల్ పి.వెంకటాపురం సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ని తిలకిస్తున్న డిప్యూటీ సీఎం

- విజువల్ థింకింగ్‌పై దృష్టి పెట్టాలి
- గొల్లప్రోలు జడ్పీ ఉన్నతపాఠశాలలో సైన్స్‌ల్యాబ్ ప్రారంభించిన పవన్

గొల్లప్రోలు, నవంబరు 4: విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్‌ను ఆయన సోమవారంప్రారంభించారు. పిఠాపురం నియోజకవర్గంలోని 33 ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను ఇక్కడ నుంచే ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. విజువల్ థింకింగ్‌పై దృష్టిసారించాలన్నారు. విద్యార్థులు ఎంత బాగా చదువుకుంటే దేశం అదేస్థాయిలో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమేనని చెప్పారు. మనస్సు ఎంతబలంగా ఉంటుందో శరీరం కూడా అంతే బలంగా ఉండాలని సూచించారు. డ్రాయింగ్ స్కిల్స్ బాగుంటే చదివిన అంశాలు గుర్తుంటాయన్నారు.

విద్యార్థులతో ముచ్చటిస్తూ..

విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్స్‌ను పవన్ ఆసక్తిగా తిలకించారు. ప్రఖ్యాత వ్యక్తుల చిత్రాలు, వారి కోట్స్ పరిశీలిస్తూ ఇవి ఇంకా పెద్దవిగా ఉంటే బాగుంటుందని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు ప్రతి ఒక్కరి పేరు తెలుసుకుని వారితో మాట్లాడారు. వారి ఇంకా ఏయే సౌకర్యాలు కావాలని అడగగా కంప్యూటర్లు కావాలని ఒక విద్యార్థి అడిగాడు. దీనిపై స్పందించిన పవన్‌కల్యాణ్ గొల్లప్రోలు పాఠశాలతోపాటు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హెచ్ఎం ప్రేమకుమారి, సైన్స్ ఉపాధ్యాయులు, ఇతర టీచర్లతో మాట్లాడారు.

జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు ఎలిమ్కోసంస్థ ద్వారా ఉపకరణాలు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రైసైకిల్స్‌ను అందజేశారు. దివ్యాంగులతోమాట్లాడి యోగక్షేమాలుఅడిగారు.

ఎయిర్‌పోర్టు వద్దు

అన్నవరం సమీపంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదన విరమించుకోవాలని తుని నియోజకవర్గంలోని పీఈ చిన్నాయపాలెం, బెండపూడి గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు వారు పవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పుష్కర, పోలవరం కాలువల తవ్వకాలు, హైవే విస్తరణతో భూములు కోల్పోయామన్నారు.

పాములకు.. మొక్కుదాం!

నేడు నాగుల చవితి





చవితి సందడి వచ్చేసింది.. ఇంటింటా ఆనందం తెచ్చేసింది.. కుటుంబంలో చిన్నా పెద్దా అంతా కలిసి చేసుకునే పండుగ నాగుల చవితి.. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకు నేందుకు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో ఉమ్మడి జిల్లాలో పాము పుట్టలు ఎక్కువగా ఉంటాయి.ఈ నేపథ్యంలో ప్రతి ఏడా ది ఆ పుట్టలు శుభ్రం చేస్తుంటారు. ఏడాదంతా పాము కనిపిస్తే చంపుదామని ప్రయత్నిస్తారు.. నాగుల చవితి రోజున మాత్రం పాము కనిపిస్తే పూజించడం మన సంప్రదాయం.

- సర్పపూజకు ప్రాధాన్యం
- పాము పుట్టలు ముస్తాబు
- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
- బిక్కవోలు ప్రసిద్ధి

అమలాపురం రూరల్/మండపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాములకు ఏడాదంతా ఒక లెక్క.. మంగళవారం ఒక లెక్క.. ఏడాదిలో ఏ రోజు పాము కనిపించినా భయపడతారు.. వెం టనే చంపేస్తారు.. అయితే మంగళవారం మాత్రం పాము కనిపించిందంటే మొక్కుతారు.. ప్రత్యేకంగా పూజలు చేస్తారు.. ఎందుకంటే నేడు కార్తీకశుద్ధ చతుర్థి.. దీనినే నాగుల చవితిగా నిర్వ హిస్తారు.. దీపావళి అనంతరం వచ్చే కార్తీకశుద్ధ చవితిని నాగుల చవితి చేస్తుంటారు. పాముల ఆరాధన ఈనాటిది కాదు.. ఎన్నో యుగాలనాటిది.సౌభాగ్యానికి, సత్సంతాన ప్రాప్తికి సర్పపూజ చేయడం లక్షల ఏళ్ల కిందటే ఉన్నట్టు ఎన్నో పురాణాలు చెబుతున్నాయి.ఈ మేరకు ఎన్నో ఆలయాల్లో నాగరాజు విగ్రహాలు కనిపిస్తాయి. ప్రధానంగా మహిళలు చవితిరోజు ఉపవాసం చేసి పుట్టల్లో గోక్షీరం పోస్తారు. నువ్వులు,బెల్లం కలిపిన చిమ్మిలి, గుడ్లు,తేగలు వంటివి వేస్తారు. పుట్టలు అందుబాటులో లేనివారు ఇంట్లోని పూజా మందిరంలో నాగదేవతను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. వెండితో గానీ, గంధపు చెక్కతోగానీ నాగేంద్రుడి ప్రతిమను తయారు చేసి అర్చన చేస్తారు. మహిళలు పుట్టమట్టిని నుదుటిన, కర్ణాలపైనా పూసుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలా పురం, కాకినాడల్లోనే కాక ఆయా మండలాల్లోని గ్రామాల్లోను పుట్టల వద్ద మంగళవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు నిష్ఠతో నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. చవితికి తూర్పుగోదావరి జిల్లా లోని బిక్కవోలు ప్రసిద్ధి.

ప్రకృతి ఆరాధన..

ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నాగుల చవితి పండుగ నిలుస్తుంది. నాగదోషం ఉన్నవారు నాగుల చవితి రోజున పుట్టలో తప్పక పాలు పోస్తారు. తమ దోషాలు తొలగించి సుఖసం తోషాలు ప్రసాదించమని నాగ దేవతలను వేడు కుంటారు. నాగుల చవితి రోజున పుట్టలో పాలు పోసి చలిమిడి, చిమిలి తమ గడపకు నివేదిస్తారు. పుట్టచుట్టూ పిండిని చల్లి ముగ్గులు వేయడం ద్వారా చీమలకు ఆహారం పెట్టడం ఏనాటి నుంచో ఉన్న ఆచారం. అందువల్ల ప్రకృతిలోని సకల జీవ జంతుజాలాన్ని సాటి ప్రాణులుగా ప్రేమించే ప్రగాఢ ఆత్మీయత.. ఆరాధించే నిరంతర అభ్యాసనం అలవడ్డాయి. ఆ పరంపరలోనే విష సర్పాలను సైతం పూజిస్తూ భక్తి ప్రపత్తులను చాటుకునే ఆచారం అనాదిగా ఉంది. సర్పారాధనకు తామరపుష్పాలు, కర్పూరం, పూలు, లడ్డూ మొదలైనవి శుభప్రదమైనవి. సర్పారాధన చేసేవారి వంశం తామర తంపరగా వర్ధిల్లుతోందని భవిష్య పురాణం చెబుతోంది.

పుట్టను దర్శించుకుంటే..

ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ-సంతాన శ్రేయస్సుకు, విషమ సమస్యల నివారణకు, సుఖ శాంతులకు, నేత్ర, కర్ణ, ఉదర సంబంధిత సమస్త వ్యాధుల నిర్మూలనకు నాగులచవితి శుభదినాన జరిపే నాగార్చన ఎంతో శ్రేష్ఠమైనదని శాస్త్రం చెబుతోంది. ప్రధానంగా మహిళలు చవితిరోజు ఉపవాసం చేసి పా ముల నివాస స్థలాలైన పుట్టల్లో గోక్షీరం పోస్తారు.నువ్వులు, బెల్లం కలిపిన చిమ్మి, పండ్లు మొదలైన వాటిని నివేదన చేస్తారు. మహిళలు పుట్టమట్టిని నుదుటిన, కర్ణాలపైనా ధరిస్తారు. ఉపవశించిన వారు మర్నా డు ఓ బ్రహ్మచారైన పురోహితుడికి భోజన తాంబూలాదులు సమర్పించి ఆ తర్వాతనే ఉపవాస దీక్షను విరమిస్తారు.ఇలా చేస్తే సర్పదోషాలు, సర్పజాతి వల్ల కలిగే భయాలు,గండాలు తొలగిపోతాయని భక్తుల అచంచల విశ్వాసం.

స్వామిని చూద్దామని..

చాగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం శివయ్యకు ఎంతో ఇష్టమైన రోజు.. అందునా తొలి సోమవారం చాగల్లు శివాలయంలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఆ పరమ శివుడి నిత్యాభిషేకం కోసం ఆలయ పూజారి చెరుకూరి శివ సీతారామ్ తెల్లవారుజామున ఆలయం తలుపులు తెరవగా శివలింగానికి చుట్టుకుని నల్లత్రాచుపాము దర్శనం ఇచ్చింది. నాగేంద్రుడు దర్శనంతో తన జన్మ ధన్యమైందని భక్తి పారవశ్యంతో స్వామికి మొక్కుకున్నాడు. పాము ఉన్నంత సేపు ఆలయ ముఖద్వారం వద్దనే వేచి ఉండి వేదమంత్రాలతో స్వామివారిని స్మరించుకున్నాడు. కొద్దిసేపటి తరువాత ఆలయం బయటకు వచ్చి పడగలతో ఉండే నాగేంద్రుడి విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ కొద్దిసేపు పడగవిప్పి దర్శనం ఇచ్చింది. పూజారి భక్తులకు తెలియజేయడంతో ఆపరమ శివుడే ఆలయానికి విచ్చేశారని ఆనంద పారవశ్యం చెందారు. విషయం తెలుసుకుని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని భక్తితో పూజలు చేశారు. చాగల్లు శివాలయ చరిత్రలో ఇదొక అద్భుతమని భక్తులు భావిస్తున్నారు.



చాగల్లు శివాలయంలో నల్లత్రాచుపాము



సామర్లకోట భీమేశ్వరాలయం కోనేరు వద్ద తెల్లవారుజామున సూర్యోదయం

భానుడు గీసిన.. చిత్రమిది!

ప్రకృతి అంటేనే అందం.. ఆ అందాన్ని మనసారా ఆస్వాదించాల్సిందే.. తనివితీరా వీక్షించాల్సిందే.. ఈ చిత్రమే చూడండి ఎంత అందంగా ఉందో కదూ.. చిత్రకారుడు కలం నుంచి జాలువారి నట్టు ఉంది కదా.. కానే కాదు.. ఇది ప్రకృతి గీసిన చిత్రం.. సోమవారం తెల్లవారుతుండగా భానుడు ఇలా దర్శనమిచ్చాడు.. కార్తీక మాసం సోమవారం సందర్భంగా సామర్లకోట భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడుతోంది.. భక్తులంతా స్నానమాచరిస్తుండగా భీమేశ్వరాలయం వద్ద కోనేరులో తన ప్రతిరూపం తానే సూరీడు ఇలా ఉదయించాడు.. ఈ సుందర దృశ్యం ఆంధ్రజ్యోతి కెమెరాకు ఇలా చిక్కింది.. - సామర్లకోట



సామర్లకోటలో భీమేశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



పిఠాపురం పాదగయ పుష్కరిణి వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రాజమహేంద్రవరం గోదావరిలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో స్వామి దర్శనానికి వేచిఉన్న భక్తులు

ఆలయాల్లో 'కార్తీకం' సందడి

- కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల పుణ్యస్నానాలు

కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు.

వైభవంగా కోటిబిల్వార్చన

- అయ్యప్ప శరణుఘోషతో మార్మోగిన ప్రాంగణం
- కోలాహలంగా అయ్యప్పస్వాముల పేడధూళి
- లక్ష దీపాలతో ప్రత్తిపాడులో ఆధ్యాత్మిక సందడి





లక్ష దీపోత్సవాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు. పక్క చిత్రంలో పడిపూజకు హాజరైన భక్తులు

ప్రత్తిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మొదటి కార్తీక సోమవారం ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. ప్రత్తిపాడు మినర్వా కళాశాల సమీపంలో లక్షదీపాల మధ్య కోటి బిల్వార్చన పూజలు వైభవంగా జరిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు అనకాపల్లి, విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీ ఎత్తున అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. కేరళ సంప్రదాయ మంగళ వాయిద్యాల మధ్య పేడధూళి కార్యక్రమాన్ని కోలాహలంగా జరిపారు. అయ్యప్ప కోటిబిల్వార్చన ప్రాంగణం వద్ద ఉదయం గణపతి పూజ, మండపారాధన, లక్ష్మీ గణపతి హోమాలు, చండీహోమం, పూర్ణాహుతి యాగాలు చేశారు. దంపాళిగురువర్యుల గురుపూజోత్సవం చేశారు. అష్టాదశ కలశాలతో మహిళా భక్తులు స్వామి ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం పందల రాజవంశీకులు నారాయణవర్మ ప్రాంగణానికి చేరుకోగానే వేదపండితులు, అయ్యప్ప భక్తులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆయన లక్ష దీపోత్సవానికి దీపాన్ని వెలిగించి ప్రారంభించగా అయ్యప్ప భక్తుల శరణుఘోషతో కోటి బిల్వార్చన పూజలకు శ్రీకారం చుట్టారు. శబరిమలకు చెందిన ఆలయ పూజారి మేల్ శాంతి సంప్రదాయ పద్ధతిలో లక్ష బిల్వార్చన పూజ చేశారు. పడిపూజా కార్యక్రమానికి ప్రాంగణమంతా అయ్యప్ప భక్తులతో నిండిపోయింది. లక్ష దీపోత్సవంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా దీపాలను వెలిగించారు. కేరళలోని శబరిమల అయ్యప్ప సన్నిధానం మాదిరిగానే ఇక్కడ పూజలు చేశారు. అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

పులగుర్తలో ఆర్టీసీ బస్సు బోల్తా

• ముగ్గురికి గాయాలు • ఆసుపత్రికి తరలింపు • చెట్టు అడ్డు ఉండడంతో తప్పిన ముప్పు



అనపర్తి మండలం పులగుర్త వద్ద బోల్తాపడ్డ ఆర్టీసీ బస్సు

అనపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు బోల్తాపడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో రావులపాలెం బయలుదేరింది. అనపర్తి మండలం పులగుర్త వచ్చేసరికి అదుపుతప్పి రామచంద్రపురం- మండపేట కెనాల్ వైపు బోల్తాపడింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురై ఆర్తనాదాలు చేశారు. రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఉండటంతో బస్సు కాలువలోకి వెళ్లలేదు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్ సహా 26 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు స్పందించి 108కి సమాచారం అందించి ప్రయాణికులను బయ టకు తీసుకు వచ్చారు. వీరిలో రాయవరం గ్రామానికి చెందిన బొడ్డు సూర్యకళ, తూరంగికి చెందిన కొప్పిశెట్టి ఆంజనేయరాజు, కె.మల్లవరం గ్రామా నికి చెందిన నూకల వీరభద్రరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూర్యకళ తలకు బలమైన గాయం కావడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు. బస్సు స్టీరింగ్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని డ్రైవర్ తెలిపారు.

కార్తీకమాసంలో పరమేశ్వరుని పూజ ఎంతో శ్రేష్ఠం

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పరమేశ్వరుని పూజించడం ఎంతో పుణ్యమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి కె.గంగవరంలోని శివాలయం ఆవరణలో ఆయన భక్తులను ద్ధేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్తీక మాసం విశిష్టత, పరమేశ్వరుడిని పూజించే విధానం, కార్తీకమాసంలో శివుడిని పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. తొలుత అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు చాగంటి ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆలకించారు.



గంగవరంలో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మరో ప్రపంచ రికార్డుకు శ్రీ చైతన్య విద్యార్థులు సన్నద్ధం

రాజమహేంద్రవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు మరో ప్రపంచ రికార్డుకు సన్నద్ధమవుతున్నారని యాజమాన్యం తెలిపింది. పదివేల మంది విద్యార్థులు 600 మ్యాథ్స్ ఫార్ములాలను ఏక కాలంలో పఠించడానికి ఏర్పాట్లు చేశారు. దీన్ని యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారంలో తిలకించడమే కాకుండా పర్యవేక్షించనున్నారు. తుది తీర్పు నవంబరు 6న వచ్చే అవకాశం ఉందని శ్రీచైతన్య యాజమాన్యం పేర్కొంది.

మాటలు కాదు..

చేతల్లో చేసి చూపిస్తున్నా!

- పిఠాపురం సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- పిఠాపురం సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తాం
- రూ.39.76కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు
- ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్
- సమస్యలు నా దృష్టికి తెస్తే తక్షణం పరిష్కరిస్తా
- గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ల్యాబ్‌లో విద్యార్థులతో పవన్‌కల్యాణ్ సెల్ఫీ

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని జడ్పీ బాలురఉన్నత పాఠశాల వేదికగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పలు అభివృద్ధి పనులకు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రజలు, మీడియాతో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ ప్రజలు బలంగా నిలబడి రాష్ట్రంలో, దేశంలో బలంగా నిలిపారని, మీ ఆశీస్సులతో డిప్యూటీ సీఎం అయ్యాయనని అన్నారు. మీ రుణం తీర్చుకునే విధంగా పనిచేసి చూపిస్తానని తెలిపారు.

పనులు చేసుకుంటూ వెళ్తా

ప్రతిరోజూ నేను స్వయంగా ఇక్కడకు రాలేకున్నా, నా మనస్సు అంతా ఇక్కడే ఉంటుందని డిప్యూటీ సీఎం పవన్ చెప్పారు. తాను నోటితో చెప్పనని పనులు చేసుకుంటూ వెళ్తున్నానని తెలిపారు. నా కళ్లు, చెవులు మీరే, ఏ సమస్యను అయినా నా దృష్టికి తీసుకురండి, దాన్ని పరిష్కరించేలా కృషి చేస్తానని ప్రకటించారు. తాను తరచూ ఇక్కడకు రాలేకున్నా, ఇక్కడ ఉన్న సమస్యలు, ప్రజలు ఇబ్బందులను ప్రత్యేకంగా అధికారులను పంపి తెలుసుకుంటున్నానని తెలిపారు. సుద్దగడ్డ వరదలు వచ్చినప్పుడు గొల్లప్రోలు జగనన్న కాలనీకి వచ్చి వారి కష్టాలు స్వయంగా చూశానని, రాకపోకలకు వారు పడుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తానని హామీ ఇచ్చానని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లా ఖనిజ నిధుల నుంచి బ్రిడ్జి నిర్మాణానికి కలెక్టరు ద్వారా రూ.4కోట్లు మంజూరు చేయించిఈ రోజున శంకుస్థాపన చేశానని, అది తన నిబద్ధత అనితెలిపారు. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

పిఠాపురం ప్రాంత అభివృద్ధి సంస్థ ఏర్పాటు

పిఠాపురం నియోజకవర్గ పరిధిగా పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ఇది త్వరలోనే కార్యరూపం దాలుస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిగా ఉన్న పిఠాపురంసీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకుగాను అదనపు భవనాల నిర్మాణం, స్కానింగ్ సహా అన్ని అత్యాధునిక సదుపాయాల కల్పనకు రూ.39.76కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో రూ.14.38కోట్ల వ్యయంతో 223 సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని పవన్ చెప్పారు. మరో రూ.5.54కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలకు త్వరలోనే ఆమోదం లభిస్తుందని తెలిపారు. గొల్లప్రోలు, నాగులాపల్లి సీపీడబ్ల్యూఎస్ పథకాల మరమ్మతులకు రూ.56లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. పిఠాపురం పశువుల సంత ఆధునికీకరణకు ఇచ్చిన మాట ప్రకారం రూ.1.34కోట్లను మంజూరు చేశామని, ఇప్పటికే టెండర్లు పిలిచారని తెలిపారు. విశాఖ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆగేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వన్నెపూడి ఎస్సీ కాలనీ శ్మశానవాటిక అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 22 సెంట్లు భూసేకరణ చేయడంతోపాటు రూ.28లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాస పెంపొందించేందుకు 33 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేబ్రోలులో కోటి రూపాయిలతో నగరవనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పిఠాపురంలో సీపేజీ వాటర్‌ప్లాంటు ఏర్పాటుకు ఆరు ప్రాంతాల్లో 2.40 ఎకరాలను సేకరించనున్నట్లు తెలిపారు. గొల్లప్రోలు డంపింగ్‌యార్డు ఏర్పాటు నిమిత్తం భూసేకరణ చేయనున్నామన్నారు.

పట్టురైతులకు తక్షణ పరిష్కారం

కర్నాటక రాష్ట్రం నుంచి పట్టు గుడ్లు తెచ్చి గూళ్లు కట్టకపోవడంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారంగా రూ.11లక్షలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అక్కడికక్కడే మంజూరు చేయించారు. కలెక్టరు అందించిన పరిహారం చెక్కును రైతులకు చూపించారు. పట్టుగూళ్లు కట్టకపోవడానికిగల కారణాలను గుర్తించేందుకు హిందూపురం నుంచి సెరీకల్చర్ రీసెర్చ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలను రప్పించామన్నారు. పట్టురైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు.

సెజ్ రైతుల ఇబ్బందులు పరిష్కరిస్తాం

కాకినాడ సెజ్ రైతుల ఇబ్బందులను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం పవన్ తెలిపారు. సెజ్ రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. భూములు ఇచ్చి రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరు షాన్‌మోహన్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు.



పట్టు రైతులకు చెక్కు అందజేస్తున్న పవన్



పవన్‌కు వినతిపత్రాలు ఇస్తున్న సెజ్ రైతులు, ఇతరులు



పిఠాపురం పట్టణం రథాలపేటలో సమస్యలు తెలుసుకుంటున్న పవన్‌కల్యాణ్



పోటీలో పాల్గొన్న మత్స్యకారులు

వలకట్ల స్థలం దక్కించుకునేందుకు...

గోదావరిలో వలకట్ల అత్తరాల (స్థలం) దక్కించుకోవడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో మత్స్యకారులు సోమవారం పడవల పోటీలు నిర్వహించారు. గోదావరికి వరదలు వచ్చినప్పటి నుంచి తగ్గే వరకు చేపల వేట నిలిపివేయడం మత్స్యకారుల కట్టుబాటు. వరద తగ్గిన అనంతరం బలుసుతిప్ప నుంచి కోటిపల్లి గోదావరిలో వలకట్ల (అత్తరాల) వేటాడే స్థలం కోసం 100 ఇంజన్ బోట్లతో పోటీలు నిర్వహిస్తారు. ఎవరైతే పోటీల్లో గోదావరిలో స్థలం దక్కించుకుంటారో మళ్లీ వరదలు వచ్చేవరకు చేపల వేటకు ఆ స్థలం వారి అధీనంలో ఉంటుంది. ఏటా మాదిరిగా దీపావళి అనంతరం పోటీలు జరిపారు. - కాట్రేనికోన



ప్రత్తిపాడులో మహిళా అఘోరా సందడి

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సోమవారం ఒక మహిళా అఘోరా సందడి చేసింది. విజయవాడ నుంచి విశాఖపట్నం కారులో వెళుతూ పెట్రోలు కోసం బంకు వద్ద ఆగింది. దీంతో అక్కడే ఉన్న శివ, భవాని భక్తులు మహిళా అఘోరాను బయటకు రావాలని కోరగా ఆమె కారు దిగి కలియ తిరిగింది. భక్తులు నమస్కరించగా తిరిగి ఆమె కారు ఎక్కి వెళ్లిపోయారు. కాగా ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)





పురుషులు, మహిళల విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన సురేష్, నాగలక్ష్మీదుర్గలను అభినందిస్తున్న ఇన్‌చార్జి ఉప కులపతి శ్రీనివాసరావు

నన్నయ యూనివర్శిటీకి మంచిపేరు తేవాలి

ఉప కులపతి శ్రీనివాసరావు

అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక పోటీలు

దివాన్‌చెరువు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు మరింత క్రీడా స్ఫూర్తితో అఖిల భారత పోటీల్లో పాల్గొని విశ్వవిద్యాలయానికి మంచిపేరు తేవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు కోరారు. నన్నయ వర్శిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ మహిళల, పురుషుల చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించారు. రాజానగరం నుంచి కానవరం వెళ్లి వచ్చే విధంగా 10 కి.మీ. మేర నిర్వహించిన ఈ పోటీలను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి, వీసీ మాట్లాడుతూ వివిధ గ్రామాల మధ్య నుంచి నిర్వహించే పరుగు పందెం పోటీలే క్రాస్ కంట్రీ పోటీలన్నారు.

పురుషుల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థి బి.సురేష్ 10 కి.మీ. పరుగును 36.50 నిమిషాల్లో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు. భీమవరం డీఎన్‌ఆర్ కళాశాల విద్యార్థి ఎం.లీలాగణేష్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం, భీమడోలు ఎస్‌వీ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.సాయిరామ్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

మహిళల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థి బి.నాగలక్ష్మీదుర్గ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వై.కౌశల్య ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం, కాకినాడ ఏపీ ఎస్‌డీ ప్రభుత్వ కళాశాల విద్యార్థి ఎస్.శిరీష తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. పురుషులు, మహిళలు కేటగిరీల్లో నాలుగు, ఐదు, ఆరు స్థానాలు సాధించిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన ఆరుగురు పురుషులు, మరో ఆరుగురు మహిళా విద్యార్థులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేశారు. మంగుళూరు విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి జరిగే అఖిల భారత క్రాస్ కంట్రీ పోటీల్లో వీరు పాల్గొంటారు. చెప్పారు. పురుషుల, మహిళల ఓవరాల్ చాంపియన్‌షిప్ విన్నర్స్‌గా నిలిచిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కార్యనిర్వాహక కార్యదర్శులు ఎ.సత్యనారాయణ, కె.బాలసత్యనారాయణ, పరిశీలకురాలు జి.ప్రమీలారాణి, ఎంపిక కమిటీ సభ్యులు బీవీ నరసింహరాజు, పి.సునీతమ్మ, రాజానగరం ఎస్ఐ నాగార్జున, విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ జట్టు ఎంపిక

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ జట్టు ఎంపిక పూర్తయినట్టు పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి కె.బాలసత్యనారాయణ తెలిపారు. పురుషుల జట్టులో బి.సుభేష్ (ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల, తణుకు), ఎం.లీలాగణేష్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), పి.సాయిరాం (ఎస్‌వీ డిగ్రీ కళాశాల, భీమడోలు) ఎ.మోహనకృష్ణప్రసాద్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), ఎ.శివాజీ (ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), బి.మోహనరావు (ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), మహిళా జట్టులో బి.నాగలక్ష్మీదుర్గ (ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు), వై.కౌసల్య (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.శిరీష (ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల, కాకినాడ), బి.శిరీష (సీఆర్ రెడ్డి మహిళా కళాశాల), ఎస్.రిషిత (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), ఎన్.స్వాతి (సీఆర్ రెడ్డి కళాశాల, ఏలూరు) ఎంపికయ్యారు.

తండ్రిని హతమార్చిన తనయుడు

సోదరుడు, మేనత్తలపై దాడికి యత్నం

అడ్డుకున్న తండ్రిని కర్రతో కొట్టి చంపిన కొడుకు



మృతుడు తాతారావు (పాత చిత్రం)

తొండంగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కనిపెంచిన తండ్రిని కర్కశంగా కర్రతో కొడుకు కొట్టి చంపిన సంఘటన కాకినాడ జిల్లా తొండంగి మండలం గొల్ల ముసలయ్యపేటలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్ల ముసలయ్యపేటకు చెందిన యాదాల తాతారావుకు(66) ముగ్గురు సంతానం. వారిలో ఒకరు కుమార్తె కాగా... అర్జున్ ప్రథమ కుమారుడు, గోవిందు రెండో కుమారుడు. తాతారావుకు గల 9 ఎకరాల భూమిని పంచి ఇవ్వమని అనేక సార్లు అర్జున్ గొడవ పెట్టిన నేపథ్యంలో మూడు ఎకరాల చొప్పున భూమిని పంచి ఇచ్చాడు. తమ్ముడు వాటాలో ఒక ఎకరం రొయ్యల చెరువు రాగా తన జీవనాధారం కోసం తాతారావు తన దగ్గర ఉంచుకున్నాడు. అర్జున్‌కు సాధారణ భూమి వచ్చింది. తండ్రి వద్ద రొయ్యల చెరువు ఉంచుకోవడం అర్జున్‌కు నచ్చలేదు. దీంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. దాని కోసం తరచూ తండ్రితో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున గోవిందు, మేనత్త దండమ్మ ఇంటి వద్ద ఉండగా తలుపు తోసుకుని లోపలకు వెళ్లి గోవిందుపై దాడి చేసేందుకు అర్జున్ ప్రయత్నించాడు. దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన దండమ్మను కూడా తీవ్రంగా గాయపర్చడంతో ఆమె రోదనలు విన్న తాతారావు అక్కడకు రాగా అతడిపై కర్రతో దాడి చేయడంతో కుడి చెవి వద్ద, మెడపైన బలమైన గాయాలై తాతారావు అక్కడికక్కడే మృతి చెందాడు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ జగన్మోహన్ సంఘటనా స్థలిని పరిశీలించారు. మృతుడి చిన్న కుమారుడు గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాతారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అడవి పందుల వేటకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



రెవెన్యూ భూమిలో విగతజీవిగా తలుపులయ్య

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం భావారం-నరేంద్రపట్నం గ్రామాల మధ్య ఉన్న రెవెన్యూ భూముల్లో చాలా మంది విద్యుత్ వైర్లతో వన్యప్రాణులను వేటాడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి అడవి పందులను వేటాడడానికి విద్యుత్ వైర్లు అమర్చడానికి పోతురాజు తలుపులయ్య అనే వ్యక్తి వెళ్లాడు. ఈ క్రమంలో అతడే విద్యుత్ షాక్‌కు గురై మరణించినట్టు స్థానికులు చెప్పారు. అటవీ, విద్యుత్, పోలీసు శాఖల అధికారులు సంఘటనాస్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు జగ్గంపేట ఎస్ఐ రఘునందన్‌రావు చెప్పారు.

పోలవరం కాల్వలో దూకి వ్యక్తి ఆత్మహత్య

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పద్మనాభ నగర్ చెందిన చిక్కాల చక్రధర్ (27) బైక్ షోరూమ్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గోకవరం రోడ్డులోని పోలవరం కాల్వ వద్దకు వెళ్లి కొందరు మిత్రులకు ఫోనులో మెసేజ్‌లు పెట్టాడు. అనంతరం కాల్వలో దూకినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఆదివారం రాత్రి నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పోలవరం కాల్వలో చక్రధర్ విగతజీవిగా కనిపించగా బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి పంపించారు. ఆత్మహత్యకు గల కారణాలను సీఐ వైఆర్కే శ్రీనివాసరావు తెలుసుకుంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యుపాశం



వీర్రాజు, నాగేంద్ర, మణికంఠ, కృష్ణ... రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు వీరివి.. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ముందుంటారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటులో కూడా అంతే ఉత్సాహం చూపారు. 18 నెలలుగా వివాదం నెలకొనడంతో ఎప్పుడెప్పుడు విగ్రహావిష్కరణ జరుగుతుందా అని ఎదురు చూశారు. వేర్వేరు కారణాలతో ఇరు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు జరగ్గా జిల్లా అధికారులు, నాయకులు శాంతి చర్చలు జరిపారు. ఒక కమిటీ వేసి కొన్ని నిబంధనలతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిచ్చారు. దీంతో ప్రారంభోత్సవ ఏర్పాట్లలో భాగంగా భారీ ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతంతో ఆ నలుగురు యువకులూ తనువు చాలించారు.



నలుగురు మృతికి కారణమైన ఫ్లెక్సీ

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం

నలుగురు యువకుల దుర్మరణం

తాడిపర్రులో తీవ్ర విషాదం

గ్రామంలో 144 సెక్షన్ ఏర్పాటు

ఫ్లెక్సీల తొలగింపునకు తహసీల్దారు ఆదేశాలు

కన్నీరుమున్నీరుగా విలపించిన బంధువులు

మృతుల కుటుంబాలకు మంత్రి దుర్గేశ్, కలెక్టర్ ప్రశాంతి పరామర్శ

ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటన

ఉండ్రాజవరం/పెరవలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సోమవారం ఉదయం సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విగ్రహావిష్కరణను ఎంతో ఘనంగా నిర్వహించాలని తలంచారు. అనుకున్నదే తడవుగా 20 అడుగుల భారీ ఫ్లెక్సీ చేయించారు. దానిని ఎంతో ఉత్సాహంగా తీసుకొచ్చి తెల్లవారుజామున ఏర్పాటుకు ఉపక్రమించారు. ఐరన్ చట్రానికి ఫ్లెక్సీని అంటించి కర్రలతో నిలబెట్టే సమయంలో రోడ్డు పక్క నుంచి వెళ్లిన 6.3 కేవీ సింగిల్ ఫేజ్ వైరు తగిలింది. ఐరన్ చట్రానికి విద్యుత్ ప్రవహించగా ఫ్లెక్సీ పట్టుకున్న ఏడుగురు యువకుల్లో బొల్లా వీర్రాజు (26), పామర్తి నాగేంద్ర (25), మారిశెట్టి మణికంఠ (26), కాసగాని కృష్ణ (25) అక్కడికక్కడే మరణించారు. కోమటి అనంతరావు తీవ్ర గాయాలపాలయ్యాడు. వెలిగట్ల పవన్, కోమటి వీర వెంకట సత్యనారాయణలకు స్వల్ప గాయాలయ్యాయి. రోజువారీ కూలితో కుటుంబాలు నెట్టుకొస్తున్న పేదల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయి.

తాడిపర్రు గ్రామానికి చెందిన బొల్లా వీర్రాజుకు 14 నెలల కిందట పెళ్లయింది. రెండు నెలల పాప ఉంది. తల్లిదండ్రులు, భార్య ఉన్నారు. వ్యవసాయం, కొబ్బరి దింపు పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మళ్లీ వస్తానంటూ వెళ్లావు కదరా... త్వరగా రా అంటూ తండ్రి త్రిమూర్తులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

పామర్తి నాగేంద్రకు పట్టింపాలెం గ్రామానికి చెందిన దుర్గతో వివాహమైంది. వీరికి 8 నెలల పాప ఉంది. కొబ్బరి దింపు కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. భర్త మృతి వార్తను జీర్ణించుకోలేక పోతోంది. తనకు దిక్కు ఎవరూ అంటూ రోదిస్తోంది. తల్లిదండ్రులు శ్రీను, ఆదిలక్ష్మి, అన్నయ్య వెంకటకృష్ణ ఉన్నారు.

మణికంఠ పూల డెకరేషన్‌లకు వెళ్తుంటాడు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడికి భార్య భవాని, అమ్మాయి (5), అబ్బాయి (3) ఉన్నారు. నలుగురు తోబుట్టువులు ఉన్నారు. ఒక్కడే అబ్బాయి కావడంతో మణికంఠను అల్లారుముద్దుగా పెంచారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు పద్దయ్య, లక్ష్మి, సోదరీమణులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కాసగాని కృష్ణ పెయింటింగ్ షాపులో చిరుద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. తండ్రి రాము ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉన్నాడు. ఇటీవలే అనారోగ్యం రావడంతో వచ్చి ఆపరేషన్ చేయించుకుని నెల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో వారం, పది రోజుల్లో ఇండియా వచ్చేస్తాడని బంధువులు చెప్పారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో.... ఇక మేమెందుకు బతకాలంటూ తల్లి పద్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు కోడిగుడ్లు కట్టుబడి పనికి వెళుతుంటాడు. ఇతడికి ఇద్దరు మగ పిల్లలు. తీవ్ర గాయాలతో ఉన్న భర్తను చూసి భార్య, తల్లిదండ్రులు సత్యనారాయణ, వెంకటలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు.

తణుకు ఆసుపత్రిలో మృతదేహాలను మంత్రి కందుల దుర్గేశ్ పరిశీలించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికీ రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు, వెలిగట్ల పవన్, కోమటి వీర వెంకట సత్యనారాయణలను మంత్రి దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

తాడిపర్రులో ఘటనా ప్రాంతాన్ని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి సోమవారం పరిశీలించారు. సంఘటన పట్ల విచారం వ్యక్తం చేసి బాధిత కుటుంబీకులను ఓదార్చారు. గ్రామంలో మరో సామాజికవర్గంవారు తమపై తరచూ ఘర్షణకు దిగుతున్నారని గౌడ సామాజికవర్గ మహిళలు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ కారు ముందు నిలుచుని తమకు న్యాయం చేసి వెళ్లాలంటూ నినాదాలు చేశారు. ఆర్డీవో రాణిసుస్మిత, డీఎస్పీ దేవకుమార్ నచ్చజెప్పడంతో మహిళలు వెనుదిరిగారు.

మృతదేహాల రాకతో ఉద్రిక్తత..

తణుకు ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో మృతదేహాలు స్వగ్రామమైన తాడిపర్రుకు చేరుకున్నాయి. అప్పటికే సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్దకు అధిక సంఖ్యలో మహిళలు, పురుషులు చేరుకున్నారు. మృతదేహాలను విగ్రహం వద్దనే ఉంచాలని.. వివాదానికి ఆజ్యం పోసేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వేరే సామాజికవర్గం యువకులను ఇక్కడకు తీసుకురావాలని వారంతా పట్టుబట్టారు. మహిళలు, గౌడ సామాజివర్గం నాయకులతో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడారు. వివాదాలకు ఇది సమయం కాదని సర్దిచెప్పారు. దీంతో మృతదేహాలను వాహనాల నుంచి కిందకు దింపి పాపన్న గౌడ్ విగ్రహం ముందు పెట్టి పువ్వులు చల్లి ఆయా కుటుంబీకుల ఇళ్ల వద్దకు చేర్చారు. అనంతరం మృతదేహాలను తీపర్రు తీసుకెళ్లి గోదావరి తీరంలో దహన సంస్కారాలు చేశారు. ఏ కార్యక్రమం జరిగినా ముందుండే యువకుల మృతిని గ్రామస్థులు తట్టుకోలేకపోతున్నారు.

ఒక వర్గానికి చెందిన ఫ్లెక్సీలు చించివేత

గ్రామంలోకి మృతదేహాలు వచ్చి వెళ్లిన అనంతరం కోపోద్రిక్తులైన ఒక వర్గం యువకులు గ్రామంలో వేరొక వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. పోలీసులు వద్దని వారిస్తున్నా వినకుండా రోడ్డు పొడవునా ఇరువైపులా పది నుంచి పదిహేను ఫ్లెక్సీలను చింపివేసి రోడ్డుపై పడవేశారు. అంతేకాకుండా కొంతమంది మరో వర్గం ఇళ్లపైకి వెళ్లిపోతుండగా పోలీసులు వారించి వెనక్కు తీసుకువచ్చారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని సోమవారం ప్రారంభించడానికి ముందు రోజు అదే రోడ్డులో ఒక ఇంటి ముందు మరో సామాజికవర్గానికి చెందిన నాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. దానికి పోటీగా అదే సైజులో ఏడుగురు యువకులు సర్దార్‌పాపన్నగౌడ్ ఫ్లెక్సీని సోమవారం తెల్లవారుజామున ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. ఈ ఘటన అనంతరం తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్... గ్రామంలో ఎటువంటి ఫ్లెక్సీ ఉండరాదని, ఎవరు ఏర్పాటు చేస్తే వారే దానిని తీసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలా తొలగించని ఫ్లెక్సీలను పంచాయతీ తరపున తొలగిస్తామని ఆటో ద్వారా ప్రచారం చేయించారు. దీంతో కొన్ని ఫ్లెక్సీలను ఎవరికి వారు తొలగించగా.. మరికొన్ని ఫ్లెక్సీలను పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఇరు సామాజికవర్గాల మధ్య గొడవలు జరిగే సూచనలు కనిపించడంతో తాడిపర్రులో సెక్షన్ 144 విధించారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన వారితో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పరామర్శించారు. సంఘటనా స్థలానికి వెళ్లి మృతులకు సంతాపం తెలిపారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మాట్లాడుతూ.... నలుగురు యువకుల మృతి బాధాకరమని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. తమ సామాజికవర్గానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడం బాధాకరమని గౌడ సంఘ మాజీ అధ్యక్షుడు మోతుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోనే ఈ ఘోరం జరిగిందన్నారు.









వీర్రాజు, నాగేంద్ర (పైన) మణికంఠ, కృష్ణ (కింద)

తాడిపర్రు ఘటనపై ఎంపీ పురందేశ్వరి దిగ్భ్రాంతి

ఆస్ట్రేలియా నుంచి ఫోన్ ద్వారా మృతుల కుటుంబాలకు సానుభూతి సందేశం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో నలుగురు యువకులు మృతి చెందిన ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆమె తాడిపర్రు దుర్ఘటన గురించి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి విషయాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారిని ఆదుకుంటామన్నారు.



తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



స్థానికులతో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రమాదం విచారకరం

బాలగంగాధర్‌తిలక్, ట్రాన్స్‌కో ఎస్ఈ

తాడిపర్రులో విద్యుత్ ప్రమాదంలో నలుగురు మృతి చెందడం విచారకరం. ఫ్లెక్సీలు కట్టిన ప్రాంతంలో 6.3 కేవీ విద్యుత్ లైన్ ఉంది. 3 అడుగుల దూరంలో ఏది ఉన్నా కరెంట్ షాక్ కొడుతుంది. ఫ్లెక్సీలను నేల నుంచి 6 నుంచి 10 అడుగులు లోపే పెట్టుకోవాలి. ఎత్తు పెరిగితే ప్రమాదాలు జరుగుతాయి. మృతుల కుటుంబాలకు తమ శాఖ తరపున ప్రభుత్వానికి నివేదిక పంపుతాము.

తణుకు ఆస్పత్రికి మృతదేహాలు



తణుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన నలుగురు మృతదేహాలను తణుకులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆసుపత్రి ప్రాంగణం నిండిపోయింది. విషయం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆస్పత్రి వద్దకు వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. శవ పంచనామా నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన కోమటి అనంతరావుకు గాయాలు కావడంతో తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

'గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం పంచాయతీ పరిధిలో ఎల్‌పీ నెంబర్ 34/1998 సామాజిక స్థలంలో భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చిన గ్రామ కార్యదర్శి, అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు చోడిశెట్టి రాము తెలిపారు.

కాకినాడ

వరద బాధితులకు 'ప్రగతి' రూ.7 లక్షల విరాళం



రూ.7 లక్షల చెక్కును పవన్ కల్యాణ్‌కు అందజేస్తున్న పూర్ణచంద్రరావు

కాకినాడ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరులో రాష్ట్రంలో సంభవించిన తుపాను వల్ల నిరాశ్రయులైన వారి సహాయార్థం ప్రగతి విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది తమవంతు సహాయంగా రూ.7 లక్షల విరాళమిచ్చారు. దీనిని ఏపీ సీఎం సహాయనిధికి చెక్కురూపంలో సోమవారం పిఠాపురం నియోజకవర్గం పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ సమక్షంలో ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్.పూర్ణ చంద్రరావు అందజేశారు. మానవతా దృక్పథంతో స్పందించి వరద బాధితుల సహాయార్థం విరాళాన్నిచ్చిన ప్రగతి యాజమాన్యాన్ని, సిబ్బందిని, విద్యార్థులను పవన్ అభినందించారు.

అదేవిధంగా సుభానికేతన్ విద్యార్థులు, సిబ్బంది కలిపి వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.2లక్షల విరాళాన్ని చెక్కురూపంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సమక్షంలో ప్రిన్సిపాల్ రమాదేవి డిప్యూటీ సీఎం పవన్‌కు అందజేశారు.

చిన్నారి వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.3 లక్షల మంజూరు



ఎమ్మెల్యేను కలిసిన చిన్నారి కుటుంబం

కాకినాడ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న 26వ డివిజన్ నాగరాజుపేటకు చెందిన చిన్నారి శేరు షణ్ముఖ సూర్య నాగలక్ష్మికి చికిత్స నిమిత్తం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3లక్షలు మంజూరు చేయించి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) ఇప్పించారు. దీంతో హైదరాబాద్‌లో చిన్నారికి శస్త్రచికిత్స చేయించి కోలుకున్న తర్వాత కాకినాడ తీసుకువచ్చారు. డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పాలెపు రాజు ఆధ్వర్యంలో నాగలక్ష్మితో కలిసి తల్లిదండ్రులు ఎమ్మెల్యే కొండబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన అద్దంకి వెంకన్నబాబు, ఆకుల ఆదినారాయణమూర్తి, కొల్లాటి శ్రీనివాస రావులను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సత్కరించారు. తన స్వగృహంవద్ద సోమవారం అవార్డు గ్రహీతలకు శాలుశాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులు 2024-బెస్ట్ టీచర్ అవార్డులు పొందడం సంతోషకరమన్నారు.

రాజుబాబుకు సన్మానం

పోర్టుసిటీ (కాకినాడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అన్నవరం సత్యన్నారాయణ స్వామి సన్నిదిలో భక్తి సంగీత గీతాపాలన చేసిన ప్రముఖ సాహితీవేత్త కరిక రాజుబాబును సన్మానించారు. దేవస్థానంలో సోమవారం దేవస్థానం అధికారి సీసీరెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ సత్యదేవుని సన్నిదిలో భక్తి గీతాలాపాన చేయడం పూర్వ జన్మ సుకృతమన్నారు.

జీతాల కోసం క్లాప్ డ్రైవర్ల భిక్షాటన

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): క్లాప్ డ్రైవర్ల 3నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ చేపట్టిన ఆందోళన 11వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి డ్రైవర్స్‌అందరూ భిక్షాటన చేసుకుంటూ మెయిన్‌రోడ్డు వరకు వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడుతూ మూడు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో కార్మికులు ఈ రోజు భిక్షాటన చేశారని, త్వరగా వేతనాలు వేయించకపోతే కుటుంబాలను పోషించుకోవడం కష్టమై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడుతాయని, అధికారులు పరిశీలన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, సంతోష్,దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదు

తాళ్లరేవు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు అక్రమంగా నిర్మిస్తున్న అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని చొల్లంగిపేట మాజీ సర్పంచ్ మైదు హరిబాబు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఏ అనుమతులు లేకుండా పంచాయతీలకు సామాజిక స్థలాలు కేటాయించకుండా లేఅవుట్ ప్లాట్లును అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తాళ్లరేవు జాతీయ రహదారి పక్కన, చొల్లంగిపేట, పి.మల్లవరం, ఇంజరం తదితర గ్రామాల్లో నాన్‌లేఅవుట్లు వేసి సొమ్ములు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పవన్ సుడిగాలి పర్యటన

పలుచోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
దివ్యాంగులకు ఉపకరణాలు, బ్యాటరీ ట్రైసైకిల్స్ పంపిణీ



కొత్తపల్లి పీహెచ్‌సీలో శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం పవన్, సర్పవరం జంక్షన్: గురుకులంలో బాలికలతో మాట్లాడుతున్న పవన్, ఎమ్మెల్యే నానాజీ

గొల్లప్రోలు/పిఠాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నతపాఠశాలలో సైన్స్‌ల్యాబ్‌ను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సోమవారం ప్రారంభించి అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రూ.63.75 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబరు-2 శిలఫలకాన్ని ఆవిష్కరించారు. గొల్లప్రోలు జగనన్న కాలనీ ప్రజలకు వరదల సమయంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ.4కోట్లతో సుద్దగడ్డ కాలువపై నిర్మించే బ్రిడ్జి నిర్మాణానికి, అర్ధంతరం నిలిచిన గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.16లక్షలు, తహసీల్దారు కార్యాలయ భవన నిర్మాణానికి రూ.28.5 లక్షలతో చేపట్టే పనులకు, పట్టణశివారు సూరంపేటప్రజలకు వరదల సమయంలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పూర్తికి రూ.24లక్షలతో చేపట్టే పనులకు, గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల తరగతి గదుల ఆధునికీకరణకురూ.19లక్షలతో చేపట్టే పనులకు, మోగలి సూర్యుడు మంచినీటి చెరువుగట్టుపై వాకింగ్ ట్రాకింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాల్ని ఆవిష్కరించారు.

పిఠాపురంలో..

పిఠాపురంలో టీటీడీ కల్యాణ మండపం వేదికగా అభివృద్ధి పనుల కార్యక్రమాల్లో పవన్ పాలు పంచుకున్నారు. టీటీడీ నిర్వహణలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.20లక్షలతో మాడవీధుల నిర్మాణానికి, రూ.73లక్షలతో టీటీడీ కల్యాణ మండపం ఆధునికీకరణ, భోజనశాల నిర్మాణానికి రూ.1.34కోట్లతో పిఠాపురం పశువుల సంత ఆధునికీకరణ పనులకు రూ.23లక్షలతో బాలికక సమీకృత వసతి గృహసముదాయం మరమ్మతులు, రూ.10లక్షలతో బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో క్రీడామైదానం అభివృద్ధికి, రూ.10లక్షలతో డిగ్రీకళాశాలలో టాయిలెట్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో కలెక్టరు షాన్‌మోహన్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మరెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, జేసీ రాహుల్ మీనా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. వినతులు స్వీకరిస్తూ...

పిఠాపురం పట్టణంలోని రథాలపేటవాసుల సమస్యలను పవన్‌కల్యాణ్ విన్నారు. తాగునీటి సమస్య, రంగుమారిన నీరు, అధ్వాన పారిశుధ్యం గురించి బాధితులు వివరించారు. దీంతో ఆయన వాహనందిగి రథాలపేటలో పర్యటించారు. అక్కడి తాగునీటిని పరిశీలించారు. ఇళ్లపట్టాల సమస్య గురించి విన్నవించారు. వీటిని తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాలుగవ అంతస్తు భవనం నుంచి పడి గాయపడిన మహేందర్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లి పరామర్శించారు. సదరం సర్టిఫికెట్ ఆలస్యంపై దివ్యాంగుడయిన అబ్రహం పవన్‌కు విన్నవించారు.

పట్టణంలోని యానాదాల కాలనీ వద్ద ఉన్న సిమెంట్ బల్లవంతెన స్థానంలో శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరారు. గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో తనకు చెందిన రికార్డులను మార్చివేశారని దుర్గాడకు చెందిన గంగాధర్ ఫిర్యాదు చేశారు.

గురుకుల పాఠశాల సందర్శన

సర్పవరంజంక్షన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బాలికలు ఉన్నత విద్యాభ్యాసంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మొక్కలు పెంపకం, పర్యావరణంవల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పించాల్సిన గురుతర బాధ్యత నవతరం ప్రతినిధులైన విద్యార్థులపై ఉందని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ పి.వెంకటాపురం సాంఘిక సంక్షేమశాఖ బాలయోగి బాలికల గురుకులం పాఠశాలను సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి సందర్శించారు. బాలికలతో పవన్ ముచ్చటించి విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, ఆహార నాణ్యత, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైన్స్‌ల్యాబ్‌ని సందర్శించి ఇంటర్మీడియెట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో మాట్లాడారు. ఎంసెట్ కోచింగ్ ఏర్పాటు చేయాలని, మహిళా డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని బాలికలు కోరారు. పాఠశాల భవనాలకు రిపేరు చేయాల్సి ఉందని సమస్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. గురుకులం పాఠశాల అభివృద్ధి కోసం రూ.20లక్షలు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తానని, పాఠశాల్లోనే ఎంసెట్ కోచింగ్ ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆర్డీవో ఎస్.మల్లిబాబు, ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకులు పేరాబత్తుల రాజశేఖర్, కరెడ్ల గోవిందు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస బాబా, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, పెంకే సోమరాజు, శిరంగు శ్రీనివాసరావు తదితరులున్నారు.

కొత్తపల్లిలో శంకుస్థాపనలు

కొత్తపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.కోటి వ్యయంతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం పవన్ సోమవారం శంకుస్థాపనలు చేశారు. కొత్తపల్లి మండల ప్రాథమిక వైద్యఆరోగ్యకేంద్రంలో రూ.7.50లక్షలతో నిర్మించే అవుట్‌పేషెంట్ బ్లాక్, ఇసుకపల్లిలో రూ16లక్షలతో నిర్మించే అదనపు గదులు నిర్మాణాలు, రవీంద్రపురంలో రూ.32లక్షలు, కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డి రూ.16లక్షలు, కొండెవరం శివారు శొంఠివారిపాకల్లో ప్రాథమిక పాఠశాలలకు రూ.16లక్షలతో అదనపు గదుల నిర్మాణాలు, మూలపేటలో బీసీ హాస్టల్ ఆధునికీకరణ నిమి త్తం రూ.4లక్షలతో నిర్మాణాల పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అమీనబాద్ సర్పంచ్ నక్కా మణికంఠ ఉప్పాడ-అమీనబాద్ తీరప్రాంతంలో నిర్మించే మినీహార్బర్ మొగలో బోట్లు ప్రమాదాలకు గురికాకుండా సముద్రంలో గతంలో నిర్మించిన గోడను మరో 200మీటర్లు పెంచాలని విన్నవించారు. కేఎస్‌ఈజెడ్ ప్రాంతాలకు చెందిన రైతులు భూముల రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీరాంపురం సర్పంచ్ రమేష్ వినతిపత్రం సమర్పించారు. గోర్స సీతారామస్వామి ఆలయ భూములను కాపాడాలని గ్రామస్తులు ప్లకార్డులు ప్రదర్శించారు. తన మేనకోడలు తొండంగి మండలం ఎల్లయ్యపేట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాకాలలిత(27) అదృశ్యంపై ఫిర్యాదు చేసినా ఆచూకీలేదని అమరవల్లి సర్పంచ్ జయబాబు విన్నవించారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత



స్కానింగ్ సెంటర్‌లో తనిఖీలు చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత

పెద్దాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత నిర్వాహకులను ఆదేశించారు. పట్టణ పరిధిలో ఉన్న ఆదిత్ హాస్పటల్, విజయలక్ష్మీ హాస్పటల్, శ్రీనివాసా హాస్పటల్, కృష్ణా రీకాన్ స్కానింగ్ కేంద్రాలను ఆమె సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో సౌకర్యాలపై ఆరాతీశారు. నిబంధనలు అతిక్రమించి ఆసుపత్రులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ అనూషారాయ్, డాక్టర్ నీహారిక తదితరులు పాల్గొన్నారు.

'ధాన్యం రవాణా చార్జీలను రైతులకే చెల్లించాలి'

కరప, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం రవాణా చార్జీలను నేరుగా రైతులకే చెల్లించాలని కోరుతూ మండలంలోని వేళంగి రైతులు సోమవారం జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు. రైతుభరోసాకేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు చేస్తున్న సమయంలో ప్రభుత్వం జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న ట్రాక్టర్లకు రవాణా చార్జీలు చెల్లిస్తుందన్నారు. వాస్తవానికి రైతులు 75 కిలోల బస్తాకు రూ.80లు చొప్పున రవాణా చార్జీలు చెల్లించి రైతుభరోసాకేంద్రం ద్వారా సీఎంఆర్ మిల్లులకు ధాన్యాన్ని పంపిస్తున్నట్లు రైతులు వాసిరెడ్డి మోహనరావు, తలాటం ప్రకాష్ తెలిపారు. గతేడాది నుంచి ట్రాక్టర్ యజమానులకు రవాణా చార్జీలను చెల్లిస్తున్నారని, అంతకముందు అయితే ధాన్యం సొమ్ముతో బాటు రవాణా ఖర్చులు రైతు ఖాతాకు జమచేసేవారని వారు వివరించారు. మారిన విధానం వల్ల రైతులు రవాణా చార్జీలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై అధికారులు విచారించి రైతులకు న్యాయం చేయాలని ఫిర్యాదులో వారు కోరారు.

'కబ్జాదారుల నుంచి ప్లాట్‌ను ఇప్పించాలి'

కాకినాడ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పర్లోవపేటలోని టిడ్కో అపార్టుమెంటులో తనకు కేటాయించిన ప్లాట్‌లో కొందరు అపరిచిత వ్యక్తులు కబ్జా చేసి తలుపు తాళం పగులగొట్టి వేరే తాళం వేశారని, వారిపై చర్యలు తీసుకుని తన ప్లాట్ తనకు ఇప్పించాలని 35వ డివిజన్ మాదిరెడ్డి వారి వీధికి చెందిన దుంపా శేషారత్నం సోమవారం కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు. ఈ ప్లాట్ నిమిత్తం తొలుత చెల్లించిన రూ.లక్ష డీడీతోపాటు మొత్తం రుణం 3లక్షల60వేలు ఒకే దఫా బ్యాంకులో చెల్లించానని ఆమె తెలిపారు. కార్పొరేషన్ అధికారుల ద్వారా ప్లాట్ రిజిస్ట్రేషన్ కాకపోవడంతో కరెంటు కనెక్షన్ రాలేదని తెలిపారు. దీంతో ప్లాట్‌కు తాళం వేసుకుని మాదిరెడ్డివారివీధిలో అద్దెకు ఉంటున్నానని, కబ్జాదారుల నుంచి తన ప్లాట్‌ను తనకు ఇప్పించాలని ఆమె కోరారు.

పేదలకు భోజనం

తాళ్లరేవు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీనేత పిల్లి సత్తిబాబు కుమార్తె పిల్లి శ్రావణి పుట్టినరోజు సందర్భంగా నీలపల్లి జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు, తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ద్వారా పేదలకు భోజనాలను పంపిణీ చేశారు. ముమ్మిడివరం అన్న క్యాంటీన్‌లో మూడుపూటలా భోజనం, టిఫిన్లు ఏర్పాటు చేశారు. సత్తిబాబు కుటుంబ సభ్యులను లయన్స్‌క్లబ్ సభ్యులు అభినందించారు.

రక్తదాన శిబిరం

తాళ్లరేవు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్ పుట్టినరోజు సందర్భంగా క్రీమ్ కాంపౌండ్‌లో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. అభిమానులు రక్తదానం చేశారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

వలంటీర్ల నిరసన దీక్ష

తాళ్లరేవు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వలంటీర్లు సంఘం సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. సీపీఎం నేతలు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, వడ్డి ఏడుకొండలు మద్దతు తెలియజేశారు. వలంటీర్లు వల్లు మహాలక్ష్మి, ఇసుకపట్ల లక్ష్మి పాల్గొన్నారు.

'శకుంతలాదేవిని స్ఫూర్తిగా తీసుకోవాలి'

సామర్లకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ కంప్యూటర్‌గా పేరొందిన శకుంతలాదేవిని ప్రతీ విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ పేర్కొన్నారు. గణిత మేధావి శకుంతలాదేవి జయంతిని సోమవారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ లెక్కల్లో పలు చిక్కులు, మెళకువలు, సులభరీతిలో లెక్కలపై పట్టు సాధించడం ద్వారా లెక్కల్లో పట్టు సాధించడమే గాక తమ జీవితాలను లెక్క ప్రకారం చక్కదిద్దుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీఆర్ఎన్ వల్లీ, ఏశ్రీవల్లీ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



శకుంతలాదేవి జీవితాన్ని వివరిస్తున్న హెచ్‌ఎం

కూటమి ప్రభుత్వంతోనే మౌలిక సదుపాయాలు కల్పన

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



హుస్సేన్ పురంలో తాగునీటి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అన్నిమౌలిక సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో కొత్తపేట నందు సోమవారం రూ.24.23 లక్షల వ్యయంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును రాజప్ప ప్రారంభించి తాగునీటి కుళాయి తిప్పి మహిళలకు బిందె అందించారు. అనంతరం పంచాయతీ ఆవరణలో సుందరీకరణ పనులు, పంచాయతీ ఆదాయ వనరుల పెంపుదలకు నూతనంగా నిర్మించనున్న 4 దుకాణ సముదాయాల కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. చిన్న గ్రామాల్లో సైతం అంతగా పనులు లేకున్నా 11 మంది సచివాలయ సిబ్బందిని ఏర్పాటుచేసి గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. గ్రామంలో వనరుల పెంపుదలకు సమష్టిగా కృషి చేయడమే గాకుండా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలకు పార్టీలకతీతంగా నమోదులు చేపట్టాలని రాజప్ప సూచించారు. కార్యక్రమంలో డబుల్ సెవెన్ రాజు, టీడీపీ మండలాధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, గుమ్మళ్ళ రామకృష్ణ, చల్లా బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు. సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామంలో 1 నుంచి పదవతరగతి వరకూ ప్రైవేట్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు విద్యార్థుల నుంచి ఆర్జిస్తూ పంచాయతీకి ఒక్క రూపాయి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో గ్రామ ఎంపీటీసీ, మాజీ జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు మలకల సూర్యారావు చినరాజప్పకు ఫిర్యాదు చేశారు.

చినరాజప్ప ప్రత్యేక పూజలు

కార్తీకమాసం తొలి సోమవారం మహాపర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప,అనూరాధ దంపతులు సామర్లకోట భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా కాలభైరవస్వామిని దర్శించి ఆలయ ఆవరణలో అన్ని ఉపాలయాల్లో దేవతామూర్తులను దర్శించారు. భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు చేసారు. నందిమండపం వద్ద ఎమ్మెల్యే దంపతులకు పండితులు వేదాశీర్వచనం అందజేసి ప్రసాదాలను అందజేసారు. ఆలయంలో భక్తులకు చేపట్టిన పలు ఏర్పాట్లను సమీక్షించి మరింత మెరుగైన చర్యలు చేపట్టాలని సూచించారు. డబుల్ సెవెన్ రాజు పాల్గొన్నారు.

సమస్యల అర్జీలకు సత్వర పరిష్కారం

కమిషనర్ భావన



సమస్య వింటున్న కమిషనర్ భావన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30గంటల నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌కు 15మంది ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి కమిషనర్ భావన 30అర్జీలు స్వీకరించారు. పలువురు కాంట్రాక్టర్లు నేరుగా కమిషనర్‌కు బిల్లుల చెల్లింపు విషయమై అర్జీలు అందించగా సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు పాల్గొన్నారు.

శలపాక నిందితులను గ్రామ బహిష్కరణ చేయాలి



కాకినాడలో ధర్నా చేస్తున్న శలపాక గ్రామస్తులు

గ్రామపెద్దలు, గ్రామస్తులు నిర్ణయం
కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం శలపాక గ్రామంలో కత్తులతో నరికి పాశవికంగా హత్యలు చేసిన ఆరుగురు కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ హత్యలో ప్రధాన నిందితుల కుటుంబాలను బహిష్కరించాలని గ్రామపెద్దలు, గ్రామస్తులు నిర్ణయించారని, అత్యంత పాశవికంగా హత్యలు చేసిన వారు గ్రామంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సంఘటన జరిగిన దగ్గర నుంచి శలపాక గ్రామస్తులను సమీప గ్రామస్తులు నిందితులుగా చూస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని గ్రామబహిష్కరణ చేయాలని నిర్ణయించామన్నారు. దీనికి కలెక్టర్ అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణుకి కూడా గ్రామస్తులు వినతి ఇచ్చారు. గ్రామస్తులు తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదించాలని కోరారు.

'గ్రామాలను విలీనం చేయాలి'

కాకినాడ కార్పొరేషన్‌లో రూరల్ పరిధిలో ఉన్న గ్రామాలను తక్షణమే విలీనం చేయాలని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలేనిరాహారదీక్ష చేపట్టారు. గ్రామాలను విలీనం చేయకపోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదని, గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధిలో కుంటుపడుతున్నాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల విలీన ప్రక్రియకు సంబంధించి జీవో విడుదల చేయాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ దీనిపై స్పందించాలన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు ఈ దీక్ష కొనసాగుతుందన్నారు.

జిల్లా యంత్రాంగానికి సంపూర్ణ సహకారం

డీఆర్వోను కలిసిన ఏపీఎన్జీవోస్ అసోసియేషన్

కాకినాడ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె.వెంకట్రావును సోమవారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా యంత్రాంగానికి విధి నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఉద్యోగులకు సమస్యలు ఎదురైన సందర్భంలో సానుకూలంగా స్పందించాలని కోరారు. దీనిపై డీఆర్వో మాట్లాడుతూ ఉద్యోగులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, కాకినాడ యూనిట అధ్యక్ష, కార్యదర్శులు సత్తిరాజు, రామకృష్ణ, మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుజాత పాల్గొన్నారు.



డీఆర్వో వెంకట్రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

పాదగయలో వైభవంగా దత్త మహామండల దీక్ష

పిఠాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న స్వయంభూ దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త మహామండల దీక్ష స్వీకరణ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. భక్తులకు దత్త గురువు, జిల్లా దత్త సాయి సేవాసమితి అధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాసరావు దత్తమాలధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్నోన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాదగయలో భక్తులకు దత్తమాల ధారణ చేస్తున్న దత్త గురువు శ్రీనివాసరావు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

పోర్టుసిటీ(కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని నగరంలో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం వీధిలోని పురాతన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారికి అభిషేకాలు చేశారు. రామారావుపేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. భానుగుడి శ్రీ ఉషా రాజేశ్వరి సమేత భానులింగేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు ఒత్తులను వెలిగించారు. భీమేశ్వరస్వామి దేవాలయం ఈవో విప్పర్తి రాజేశ్వరరావు, ప్రధాన అర్చకులు కొడమంచిలి కార్తీక్ పాల్గొన్నారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు తెల్లవారుజామునే చేరుకుని పరమశివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర పూజాదికాలను నిర్వహించారు. పట్టణ పరిధిలోని విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి, కట్టమూరు రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి, కాండ్రకోటలో భువనేశ్వరీదేవీ సమేత కోటేశ్వరస్వామి, తిరుపతిలో సోమేశ్వరస్వామి ఆలయం, ఆర్‌బీ పట్నంలో చంద్రశేఖర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సతీసమేతంగా బంగారమ్మ గుడివీధిలో అయ్యప్ప, శివ, భవానీ మాలధారులకు నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ తదితరులు పాల్గొన్నారు.

కరప: మండలవ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు జరిగాయి. కరప పర్వతవర్ధినీ దేవి సమేత రామలింగేశ్వరస్వామి, కూరాడ శివారు చినమామిడాడ పంచముఖేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు విలపర్తి శ్రీనివాస్, ఫణికుమార్, అన్నప్ప, సుబ్రహ్మణ్యంలు పూజాదికాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



కరప మండలం చినమామిడాడలో పంచముఖేశ్వరస్వామిని అభిషేకిస్తున్న దృశ్యం

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

గండేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం క్షేత్రస్థాయి సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై ఏవో సద్గురుమూర్తి శిక్షణ ఇచ్చారు. పంట కోత ప్రయోగాల్లో తీసుకోవలసిన మెళకులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి చంద్రమౌళి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీ సంఘాల నాయకులు

జీవో నెం.3 పునరుద్ధరించాలి

ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీ విద్యార్థి సంఘాలు, ప్రజా ప్రతినిధులు

రంపచోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన జీవో నెం.3 పునరుద్ధరణ హామీని నిలబెట్టుకోవాలని ఆదివాసీ నిరుద్యోగులు, ఆదివాసీ విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. తొలుత ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సెంటర్లో మానవహారం నిర్మించారు. ఏజెన్సీలో ఆదివాసీల చట్టాలు, హక్కులను అమలు చేయకుండా పాలకులు నీరుగార్చడమే కాకుండా వారికి ఉద్యోగావకాశాలు రాకుండ చేస్తున్నారని ఆరోపించారు. జీవో నెం.3కి చట్టబద్ధత కల్పించి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఆదివాసీలకు న్యాయం జరగాలంటే ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలన్నారు. జీవో నెం.3 పునరుద్ధరణ, ప్రత్యేక డీఎస్సీ ప్రకటించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఐటీడీఏ అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. నిరుద్యోగ జేఏసీ నాయకులు చందు, అశోక్, నవీన్, తెల్లం శేఖర్, పందుల కామరాజు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు లోత రామారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు సోడే మురళి, బంగారు వెంకటేశ్వర్లు, తీగల బాబూరావు, వంతు బాలకృష్ణ, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీపీ బంధం శ్రీదేవి, పులి సంతోష్, శీలం శ్రీను, గణేష్, వినోద్, కె.రామన్నదొర, నరసన్నదొర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వైసీపీ ముఖ్య కార్యకర్తలు

ఆయన నాయకత్వంలో పని చేయలేం

పార్టీ ఘోర ఓటమికి దళితుడి డోర్ డెలివరీయే కారణం

ఎమ్మెల్సీ అనంతబాబుపై వైసీపీ ముఖ్య కార్తకర్తల తిరుగుబాటు

ఎటపాక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'దళితుడి హత్య, డోర్ డెలివరీతో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత పెరిగింది... రంపచోడవరం నియోజవర్గంలో గత సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థి ఘోర ఓటమి పాలైంది... దానికి కారణం అనంతబాబే... న్యూడ్ వీడియోల ఎమ్మెల్సీ నాయకత్వంలో మేము పని చేయలేం' అని వైసీపీ ఎటపాక మండల శాఖ అధ్యక్షుడు తానికొండ వాసు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నరసింహారావు అన్నారు. సోమవారం ఎటపాకలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతబాబు నియంతృత్వ ధోరణి, ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ దెబ్బతిందని, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మిని గుప్పెట్లో పెట్టుకుని ఆమెను స్వేచ్ఛగా పని చేయనివ్వకుండా అడ్డుకున్నాడని ఆరోపించారు. నియోజక వర్గంలోని రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలతో పాటు మండలాల అధ్యక్షులకు పార్టీలో గౌరవం, విలువలు ఇవ్వకుండా అహంకార ధోరణితో ముందుకు సాగారన్నారు. గడిచిన ఐదేళ్లలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అనంతబాబు కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. పదేళ్లు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, ముఖ్య కార్యకర్తల బాగోగులను పట్టించుకోలేద న్నారు. విలీన మండలాల్లో వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు, క్యాడరే ముఖ్య కారణమని, అనంతబాబు కృషి వల్ల కాదని చెప్పారు. వైసీపీకి పూర్వవైభవం రావాలంటే ఎమ్మెల్సీ అనంతబాబుని నియోజకవర్గ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించాలన్నారు. అధిష్ఠానం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పార్టీ నాశనం అవుతుందన్నారు. కార్యకర్తలు, క్యాడర్ కలిపి రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కారం కామేశ్వరి, నాయకులు గోసు ప్రశాంత్, కొవ్వూరి రాంబాబు, రంబాల నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి శివబాబు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 30 అర్జీలు

రంపచోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సుమారు 30 అర్జీలు అందాయని ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్‌వీ రమణ తెలిపారు. ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టరు జాన్‌రాజ్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. మామిడివలస, చింతలగూడెం, కింటుకూరు గ్రామాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతి మంజూరు చేయాలని, పందిరిమామిడికోటలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, రబ్బరు సాగులో నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించాలని, గుడిస పర్యాటక ప్రాంతానికి చెక్‌పోస్టును ఆకుమామిడికోటలో ఏర్పాటు చేయాలని అర్జీలు అందాయి. కార్యక్రమంలో


అర్జీదారులతో మాట్లాడుతున్న ఏపీవో రమణ

డిప్యూటీ డైరెక్టరు షరీఫ్, డీఈవో వై.మల్లేశ్వరరావు, డీఎల్పీవో రఘునందన్, డాక్టర్ వెంకట ఇందిర, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఈఈ సుబ్బయ్య, తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో పి.జయంతి, సీడీపీవో సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

మోతుగూడెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు గ్రామంలోని శ్రీదుర్గా మల్లేశ్వర ఆలయంలో స్వామివారికి పంచామృతాలు, పండ్ల రసాలు, నానావిధ పరిమళ పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం చందనం, విభూదిలతో స్వామివారిని ప్రధానార్చకుడు కుమార్ స్వామి అలంకరించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సతీష్ రాఘవని పిల్ల, సెక్రటరీ ఎం.శివరామకృష్ణ, ట్రెజరర్ వేపకాయల శ్రీను, సభ్యులు రెడ్డి త్రిమూర్తులు, నాని, రమేష్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: కార్తీక మాసం మొదటి సోమవారం మండలంలోని ఫజుల్లాబాద్, కమలం పాలెం గ్రామాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.


మోతుగూడెం పరిధిలోని పొల్లూరులో దుర్గా మల్లేశ్వరస్వామిని అభిషేకిస్తున్న అర్చకస్వామి

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఆలయాలకు కార్తీక శోభ

భక్తులతో కిక్కిరిసిన శైవ క్షేత్రాలు

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

తుని రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువ జామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో పూజలు ఆచరించారు. తాండవ సమీపంలో గల తాండవ లింగరేశ్వరస్వామి ఆలయం, తేటగుంట శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయం, తిమ్మాపురం ఉమా రామ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలందజేశారు.

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి, కొత్తూరు



తునిలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, రౌతులపూడి శివాలయంలో భక్తులు


కోటనందూరులో శివలింగానికి పూజలు


ఏలేశ్వరం శివాలయంలో శివలింగానికి అభిషేకం

రామాలయాల వద్ద నగర సంకీర్తన చేశారు. మాజీ ఉపసర్పంచ్ వెలిది వెంకటేశ్వర రావుదంపతుల చేతులమీదుగా అఖండ జ్యోతిని వెలిగించి గ్రామ పురవీధుల్లో భక్తి పాటలు పాడుతూ భజనలు చేశారు. అడబాల గంగారావు, వెలిది సుబ్రహ్మణ్యం, పడాల శ్రీను, కాపుగంటి బాబులు, చింతపల్లి వీరబ్బాయి, గొల్లవిల్లివిష్ణు, ఉండమంట్ల వెంకటేశులు, దిడ్డి బాబురావు,భక్తులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు కోడూరి మహేష్, శేఖర్, వెంకటేష్ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. లింగంపర్తి, సిరిపురంలో శైవ క్షేత్రాలు భక్తులు, అయ్యప్ప స్వాములు, మహిళలతో కిక్కిరిశాయి.

జగ్గంపేట: కార్తీక మాసం పురస్కరించుకుని జగ్గంపేట కొంగల రావి చెట్టుకు భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, కార్యదర్శి సత్యభారతి దంపతులు కొంగల రావి చెట్టు చుటూట్ట స్టేజి నిర్మించి తీర్చిదిద్దారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు రావి చెట్టుకు పూజలు నిర్వహించారు. నాగేంద్ర చౌదరి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. కార్యక్రమానికి సహకరించి ఆర్యవైశ్య పెద్దలు మానేపల్లి బంగార్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, మండపాక అప్పన్నదొర, వైభోగుల కొండబాబు యాదవ్ పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో శ్రీ కాశీగౌరీ జ్ఞానేశ్వరాలయం వద్ద తాండవ నదిలో పు ణ్యస్నానాలు, పూజలు చేశారు. కోటనందూరు, బంగారయ్యపేట, అల్లిపూడి, బీమవరపుకోటలో శివాలయాలో పూజలు నిర్వహించారు.

అరుణేశ్వర ఆలయంలో కార్తీక సందడి

ప్రత్తిపాడు: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరాలయానికి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. రమణ సేవాశ్రమ నిర్వాహకులు రామానంద స్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ధర్మవరం రాజరాజేశ్వరి, ప్రత్తిపాడు అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి, ఒమ్మంగి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాలు మహిళల కార్తీక దీపారాధనలతో సందడిగా మారాయి.

రౌతులపూడి: రౌతులపూడిలో ఉమారామ లింగేశ్వరస్వామి, శృంగవరంలో నందనవనంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోకవరం-జగ్గంపేట రోడ్డు పనులను సోమవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రోడ్డు పరిశీలించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

జగ్గంపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 602 మందికి టెట్ కోచింగ్ ఇవ్వగా అందులో 349 మంది పరీక్షల్లో క్వాలిఫై అయ్యారు. 144.69 మార్కులు సాధించిన దేవిశెట్టి దివ్యప్రభ, 135.07 మార్కులు సాధించిన పాతంశెట్టి సాయిశ్రీదుర్గ, 131.62 మార్కులు సాధించిన మోటపల్లి వీ.లక్ష్మిలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సత్కరించారు. మారిశెట్టి భద్రం, రఘురామరాజు, అడపా తాతాజీ పాల్గొన్నారు.

మహిళా రక్షక్ కార్యక్రమం

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన మహిళలకు చేరువగా మహిళా రక్షక్ అనే కార్యక్రమాన్ని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ ఆధ్వర్యంలో జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. సచివాలయ మహిళ పోలీసులు, పోలీస్ సిబ్బందితో అవగాహన సదస్సులు నిర్వహించారు. మహిళల చట్టాలు, వారి భద్రతకు పలు అంశాలను వివరించారు. 3 మండలాలకు సంబందించి మహిళా పోలీసులకు మహిళ రక్షక ద్విచక్రవాహనాలను జిల్లా పోలీసులు అందజేసినట్టు సీఐ చెప్పారు.


జగ్గంపేటలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, పోలీసులు

పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్


సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

గండేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నాయకులందరూ సత్తా సాటాలని కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని సూరంపాలెం, యర్రంపాలెం, నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న సమస్యలను కార్యకర్తలు తెలపగా ఒకొక్కటిగా పరిష్కరిస్తామని నవీన్ తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహన్‌రావు, కుంచే రాజా, జీను మణిబాబు, పాలకుర్తి ఆదినారాయణ, అడబాలవెంకటేశ్వరరావు, అనుకుల శ్రీకాంత్, కుంచే రామకృష్ణ, పోసిన బాబురావు తదితరులు ఉన్నారు.

అధికారులు, నాయకులు కలిసి పనిచేయాలి

ఎంపీడీవో నాతి బుజ్జి

గండేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీడీవో, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు హాజరయ్యారు. ముందుగా శాఖల వారీగా ప్రజలకు అందే పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అధికారులు వివరించారు. గ్రామాల్లో పలు సమస్యలను ఎంపీడీవో దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకొచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు దఫాలుగా వచ్చాయని వాటితో గ్రామాల్లో అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు శానిటేషన్, మంచినీరు తదితర పనులకు ఉపయోగించాలన్నారు.


గండేపల్లిలో సర్వసభ్య సమావేశం దృశ్యం

మూడు నెలలకొకసారి పెట్టే సర్వసభ్య సమావేశానికి పలు శాఖలాధికారులు హాజరుకాకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని లేకపోతే వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బిట్రా వరలక్ష్మి, బొల్లి రాంబాబు, ఎలక్ట్రికల్ ఏఈ ఎస్.కిరణ్‌కిషోర్, శీలా మంతుల వీరబాబు, ఏవో చంద్రరావు ఉన్నారు.

'శ్రీ ప్రకాష్'లో ప్రారంభమైన రిమ్‌జిమ్-2024

తుని రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల క్యాంపస్‌లో రిమ్‌జిమ్-2024 కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖల విద్యార్థులు సుమారు 4500 మంది పాల్గొన్నారు. సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాల మీద జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో 29 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని విద్యాసంస్థలసంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ రిమ్‌జిమ్ కార్యక్రమం ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కన్వీనర్, అకడమిక్ ఇన్‌చార్జ్‌లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

రంపచోడవరం తహసీల్దారుగా రామకృష్ణ



రంపచోడవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నూతన తహసీల్దారుగా టి.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు సత్యనారాయణ, శివ, సీనియర్ అసిస్టెంటు జిలానీ, ఆర్ఐ నిర్మల, కార్యాలయ సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

మోతుగూడెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో రూ.5లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నామని మోతుగూడెం టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మోతుగూడెంలో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. సీనియర్ నాయకుడు పాసి రమణ, నాయకుడు దార బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

'జల ఉత్సవ్'పై సమీక్ష

వై.రామవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 'జల ఉత్సవ్'ను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో బాపన్నదొర సూచించారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షించారు. వై.రామవరం మండ లాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 6న ఆయా పంచాయతీల్లో ప్రజా ప్రతినిధులు ప్రారంభించే 'జల ఉత్సవ్' కార్యక్రమాలకు అందరూ విధిగా హాజరుకావాలన్నారు. ఎంఈవో తాతబ్బాయిదొర, ఈవోపీఆర్డీ శివకుమార్, ఉపాధి ఏపీవోలు స్వామి, సాయిబాబా, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ మణికంఠ, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన రమేష్


డిప్యూటీ సీఎం పవన్‌కు మధురపూడిలో స్వాగతం పలుకుతున్న రమేష్

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిఠాపురం పర్యటనకు సోమవారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేయగా జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కలిసి బొకే అందజేశారు. జగ్గంపేట నియోజకవర్గం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వినతి ఇచ్చారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ఏలేశ్వరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో ప్రతీ కార్యకర్త కుటుంబానికి భరోసా లభిస్తుందని నగర పంచాయితీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. పట్టణంలో సోమవారం పలు వార్డుల్లో కౌన్సిలర్ అలమండ చలమయ్య నేతృత్వంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సత్యవతి మాట్లాడుతూ రూ.100 సభ్యత్వ రుసుంతో కార్యకర్తలతోపాటు వారి కుటుంబానికి భరోసా భద్రత ఉంటుందన్నారు. టీడీపీకి కార్యకర్తలే బలమని, ఏదైనా ప్రమాదంలో కార్యకర్త మరణించినప్పుడు కుటుంబాన్ని ఆదుకోవడానికి సభ్యత్వ నమోదు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. బూర్లు సత్తిబాబు, సామంతుల రామన్న, కటకం కిరీటి, రౌతు సహదేవుడు, అలమండ వీర్రాఘవ స్వామి పాల్గొన్నారు.

పేదలకు ఉచిత భోజనం

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం గండపల్లికి చెందిన యిప్పెర్ల వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు యిప్పెర్ల వీరబాబు ఆర్థిక సాయంతో పేదలకు ఉచిత భోజనం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, యిప్పెర్ల వీర్రాజు, యిప్పెర్ల సురేష్, చాగంటి సత్యనారాయణ మూర్తి, వెలమాటి శివ, కేతిన వెంకన్నచౌదరి(బాబి), వెంపాటి సతీష్, యిప్పెర్ల శ్రీనివాస్, దాపర్తి సీతారామయ్య, జీవిరమణ, ఎండీ కాజా ఉన్నారు.

'టీచర్లను నియమించాలి'

రౌతులపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని పాఠశాల చైర్మన్ షేక్ సలీం సోమవారం కాకినాడలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో డీఈఆర్వోకు వినతి అందజేశారు. ఏడుగురు ఉపాధ్యాయులు కొరత ఉందని, దీంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందడం లేదన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినవారికి జరిమానా, జైలు

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి పోలీస్‌స్టేషన్‌ల నందు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడినవారిపై కేసులు నమోదు చేశారు. వారిలో పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ జి.కృష్ణశేషచార్య ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. మరో నలుగురికి 2 రోజుల జైలు శిక్ష, పబ్లిక్ ప్లేస్‌లో తాగిన ముగ్గురికి రూ.600 చొప్పున రూ.1800 జరిమానా విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

ఆకట్టుకున్న మోహిని భస్మాసుర ప్రదర్శన

ప్రత్తిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన మోహిని భస్మాసుర కళాప్రదర్శన ఆకట్టుకుంది. భస్మాసురుడిగా చింతల సూరిబాబు, ఈశ్వరుడిగా నానిపల్లి వెంకన్న, విష్ణుమూర్తిగా సుబ్బారావు, మోహినిగా రాచపల్లి సత్తిబాబు,నారదుడిగా అప్పారావు నటించారు.


ధర్మవరంలో కళా ప్రదర్శన దృశ్యం

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

దేవీపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండలంలోని ఫజుల్లాబాద్ గ్రామంలో నాయకులతో సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ వస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికపై మాట్లాడారు. దాకారపు సత్యనారాయణ, గేదల పెదసుబ్బారావు, శివాజీ, సత్తిబాబు, సూర్రావు పాల్గొన్నారు.

ముగిసిన 'తరల్' శిక్షణ

వై.రామవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యార్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో గత నెల 28వ తేదీ నుంచి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న 'తరల్' మెథడాలజీ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. మూడు నుంచి పదో తరగతి వరకు వెనుకబడి ఉన్న విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచడమే ఈ శిక్షణ ముఖ్యోద్దేశ్యమని ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు.